నిజాం కాలేజీ బీసీ సెల్ అధ్యక్షుడిగా వెంకట్‌కౌశిక్



వెంకట్‌కౌశిక్

బర్కత్‌పుర, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): నిజాం కళాశాల బీసీ సెల్ అధ్యక్షుడిగా తాల్లూరి వెంకట్‌కౌశిక్ ఎన్నికయ్యారు. బుధవారం కళాశాలలో జరిగిన కార్యక్రమంలో నూతన కమిటీని ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షుడిగా నాగరాజు, వినోద, ప్రధాన కార్యదర్శులుగా శ్రీకాంత్, నందిని, రాజేశ్వరి, సహాయ కార్యదర్శులుగా కల్పన, ప్రవల్లిక, మానస, సోషల్ మీడియా కన్వీనర్‌గా మురళీధర్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. వెంకట్‌కౌశిక్ మాట్లాడుతూ కమిటీని బలోపేతం చేస్తానని తెలిపారు.

ఓబీసీ మోర్చా రాష్ట్ర ఎగ్జిక్యూటీవ్ సభ్యుడిగా సత్యం



నియామకపత్రం అందుకుంటున్న సత్యం

చిక్కడపల్లి, జనవరి3 (ఆంధ్రజ్యోతి): బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర ఎగ్జిక్యూటీవ్ మెంబర్‌గా గాంధీనగర్ డివిజన్‌కు చెందిన దోనోటి సత్యం నియమితులయ్యారు. ఓబీసీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు ఆలె భాస్కర్‌రాజ్ బుధవారం సత్యంకు నియామక పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సత్యం మాట్లాడుతూ.. పార్టీ సిద్ధాంతాలకు అంకితమై పని చేస్తానని తెలిపారు. సంజయ్‌గనాతె నందుబాయ్, ప్యారసాని, వెంకటేష్, రవీందర్‌గౌడ్, మారుతి తదితరులు పాల్గొన్నారు.

రవాణాచట్టాన్ని ఉపసంహరించుకోవాలి



ధర్నాలో బీపీటీఎంఎం ప్రతినిధులు

చిక్కడపల్లి, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): కేంద్రం కొత్తగా తీసుకొచ్చిన రవాణా చట్టాన్ని వ్యతిరేకిస్తూ ఆర్టీసీ క్రాస్‌రోడ్‌లో బీపీటీఎంఎం రాణిగంజ్ మినీగూడ్స్ వెహికిల్ యూనియన్ సభ్యులు బుధవారం ధర్నా నిర్వహించారు. ధర్నాలో బీపీటీఎంఎం ప్రధాన కార్యదర్శి అల్లూరి రవిశంకర్, తెలంగాణ స్టేట్ ప్రైవేట్ ట్రాన్స్‌పోర్ట్ మజ్దూర్ మహాసంఘ్ ఉపాధ్యక్షుడు హబీబ్ మాట్లాడుతూ.. కేంద్రం కొత్తగా తీసుకువచ్చిన రవాణా చట్టాన్ని ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. పెంచిన కమర్షియల్ ట్రాన్స్‌పోర్ట్ వాహనాల యాక్సిడెంటల్ ఇన్సూరెన్స్‌ను 50 శాతం తగ్గించాలన్నారు. కార్యక్రమంలో బీపీటీఎంఎం నేషనల్ అధ్యక్షుడు ఆషిమ్‌దత్, శంకర్, శ్రీనివాసముదిరాజ్, జహంగీర్, మనోజ్, పెంటయ్య, నందకిశోర్, కిషన్, రాములు, మహేష్, రంగ తదితరులు పాల్గొన్నారు.



మహాపడిపూజలో ఎమ్మెల్యే ముఠా గోపాల్ తదితరులు

భోలక్‌పూర్‌లో మహాపడిపూజ

ముషీరాబాద్, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ భోలక్‌పూర్ డివిజన్ అధ్యక్షుడు వై.శ్రీనివాస్, హర్షవర్ధన్ ఆధ్వర్యంలో రంగానగర్‌లో బుధవారం 28వ అయ్యప్ప మహాపడిపూజ వైభవంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఎమ్మెల్యే ముఠా గోపాల్, బీఆర్ఎస్ యువ నాయకుడు ముఠా జైసింహ, కవాడిగూడ కార్పొరేటర్ రచనశ్రీ ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం వారు అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. వినయ్ స్వామిచే అయ్యప్ప మహాపడిపూజ అంగరంగ వైభవంగా జరిగింది. వెంకటనారాయణ గురుస్వామి అయ్యప్ప భక్తిగీతాల భజన నిర్వహించారు. డి.శివముదిరాజ్, దీన్‌దయాల్‌రెడ్డి, ముచ్చకుర్తి ప్రభాకర్, ఉమాకాంత్, శంకర్‌గౌడ్, వెంకటేష్, మల్లేష్, యాదయ్య, పోచయ్య పాల్గొన్నారు.

ఫిజికల్ డైరెక్టర్ల సమస్యలు పరిష్కరించాలి



శృతిఓజాకు అభినందనలు తెలుపుతున్న బాల్‌రాజ్, బి.లక్ష్మయ్య తదితరులు

బర్కత్‌పుర, జనవరి 3(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని ఫిజికల్ డైరెక్టర్ల దీర్ఘకాలిక సమస్యలు పరిష్కరించాలని ప్రభుత్వ జూనియర్ కాలేజ్ ఫిజికల్ డైరెక్టర్ అసోసియేషన్ నేతలు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు ఇంటర్ బోర్డు కమిషనర్ శృతిఓజాను కలిసి పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఫిజికల్ డైరెక్టర్లు ఎదుర్కొంటున్న సమస్యలను వివరించినట్లు వారు తెలిపారు. బుధవారం అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు డాక్టర్ ఎ.బాల్‌రాజ్, డాక్టర్ బి.లక్ష్మయ్య మాట్లాడుతూ ఉన్నత పాఠశాలల్లో పీఈటీలుగా పని చేస్తున్న వారికి ప్రమోషన్లు కల్పించాలని కోరారు. కార్యక్రమంలో ఇంటర్మీడియట్ ఎడ్యుకేషనల్ రీజినల్ జాయింట్ డైరెక్టర్ బి.జయప్రద, హైదరాబాద్ జిల్లా జూనియర్ కాలేజీ ఫిజికల్ డైరెక్టర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎం.పర్వతాలుగౌడ్, ప్రధాన కార్యదర్శి జక్కయ్య తదితరులు పాల్గొన్నారు.

ఐదు గ్యారెంటీల దరఖాస్తు గడువు పెంచాలి



శ్రీనివాస్‌రావు

రాంనగర్, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): ఐదు గ్యారెంటీల కోసం విధించిన గడువును పొడిగించాలని బీఆర్ఎస్ గ్రేటర్ నాయకుడు ఎమ్మెన్ శ్రీనివాస్‌రావు రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. బుధవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. పార్లమెంట ఎన్నికల్లో లబ్ధి కోసమే ప్రజాపాలనలో ఐదు గ్యారంటీల అమలు కోసం దరఖాస్తుల స్వీకరణ తంతు అని ఆయన ఆరోపించారు. గడచిన ఎన్నికల్లో అమలు సాధ్యం కానీ హామీలు ఇచ్చిన సీఎం రేవంత్‌రెడ్డి వాటిని ఏవిధంగా అమలు చేస్తారో, నిధులు ఏ విధంగా సమకూరుస్తారో స్పష్టత ఇవ్వడం లేదన్నారు. తెల్లరేషన్ కార్డులు వెంటనే మంజూరు చేయాలని డిమాండ్ చేశారు.

అదృశ్యమైన తల్లి.. ముగ్గురు పిల్లలు భర్తకు అప్పగింత



తల్లి, పిల్లలను సాయికృష్ణకు అప్పగిస్తున్న ఇన్‌స్పెక్టర్


చిక్కడపల్లి, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): చిక్కడపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో అదృశ్యమైన తల్లీముగ్గురు పిల్లల ఆచూకీ లభించింది. వారి ఆచూకీని కనుగొని వారిని తీసుకువచ్చి పీఎస్‌లో బుధవారం ఎస్.సాయికృష్ణకు అప్పగించారు. ఇన్‌స్పెక్టర్ ఏరుకొండ సీతయ్య తెలిపిన వివరాల ప్రకారం.. గతనెల 6న చిక్కడపల్లి సంజయ్‌నగర్‌కు చెందిన సాయికృష్ణ భార్య ఎస్.సునీత, పిల్లలు చైత్ర, త్రిలోచన్, మౌనిష్ ఇంటి నుంచి అదృశ్యమయ్యారు. 29న చిక్కడపల్లి పీఎస్‌లో సాయికృష్ణఫిర్యాదు చేయగా ఎస్ఐ కోటేశ్వరరావు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.. కాగా సునీత కాల్‌లిస్ట్‌ఆధారంగా ఆమె మెహదీపట్నం సమీపంలోని ఓ చిన్న గ్రామంలో ఇళ్లలో పనిచేసుకుంటుండగా పోలీసులు ఆమె ఆచూకీ కనుగొని ఆమెను పోలీస్‌స్టేషన్‌కు తీసుకొచ్చి భర్త సాయికృష్ణకు అప్పగించారు.

పెట్టీ కేసులో యువకుడికి జైలు

చిక్కడపల్లి, జనవరి 3(ఆంధ్రజ్యోతి): పెట్టీ కేసులో ఓ యువకుడికి జడ్జి జైలుశిక్ష విధించారు. చిక్కడపల్లి ఇన్‌స్పెక్టర్ ఏరుకొండ సీతయ్య తెలిపిన వివరాల ప్రకారం.. బాగ్‌లింగంపల్లి పాలమూరుబస్తీకి చెందిన కె.కార్తీక్(26) పెట్టి కేసులో నిందితుడు. కాగా అతడిని నాంపల్లి 5వ మెట్రోపాలిటన్ స్పెషల్‌కోర్టు జడ్జిముందు ప్రవేశపెట్టగా కార్తీక్‌కు మూడు రోజుల జైలుశిక్ష విధించారు.

న్యూపటేల్‌నగర్‌లో కార్పొరేటర్ పాదయాత్ర

అంబర్‌పేట, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): అంబర్‌పేట డివిజన్ కార్పొరేటర్ విజయ్‌కుమార్‌గౌడ్ బుధవారం న్యూపటేల్‌నగర్‌లో పాదయాత్ర నిర్వహించారు. బస్తీవాసుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. రోడ్డు ప్యాచ్‌వర్క్ పనులు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.



న్యూపటేల్‌నగర్‌లో రోడ్లను పరిశీలిస్తున్న కార్పొరేటర్ విజయ్‌కుమార్‌గౌడ్

శిథిలావస్థలో ఆర్టీసీ క్వార్టర్స్

- ఖాళీ స్థలంలో ఇతర రాష్ట్రాల ఆర్టీసీ బస్సుల పార్కింగ్
- ఇబ్బందులు పడుతున్న ప్రజలు



ప్రభుత్వం లీజుకు ఇవ్వనున్న ఆర్టీసీ స్థలం

బర్కత్‌పుర, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ఆదాయాన్ని సమకూర్చుకోవడానికి ఆర్టీసీ స్థలాలను లీజుకు ఇస్తున్నట్లు సీఎం రేవంత్‌రెడ్డి వారం రోజుల క్రితం ప్రకటించారు. దీనిలో భాగంగా కాచిగూడ ఆర్టీసీ డిపో పక్కన గల ఖాళీ స్థలాన్ని ప్రైవేట్ సంస్థలకు లీజుకు ఇస్తున్నట్లు ప్రభుత్వం ప్రకటించిన విషయం విదితమే.. ఈ స్థలం కాచిగూడ రైల్వేస్టేషన్ వెనుకభాగంలో ఉండడం గమనార్హం. రైల్వేస్టేషన్‌కు అనుకుని ఉన్న 4 ఎకరాల 67 గుంటల స్థలాన్ని లీజుకు ఇస్తున్నట్లు ప్రకటించింది. ఈ స్థలంలో ప్రస్తుతం కొన్ని ఆర్టీసీ క్వార్టర్స్ ఉన్నాయి. ఖాళీ ప్రదేశంలో కాచిగూడ ఆర్టీసీ డిపోకు వెళ్లే రహదారికి ఇరువైపులా ఉన్న ఖాళీ స్థలంలో కర్నాటక, మహారాష్ట్ర, గోవా రాష్ట్రాలకు చెందిన ఆర్టీసీ బస్సులను పార్కింగ్ చేస్తున్నారు. ఈ స్థలంలో 5 దశాబ్దాల క్రితం నిర్మించిన ఆర్టీసీ క్వార్టర్స్ నేడు పూర్తిగా శిథిలావస్థకు చేరుకున్నాయి. ఈ ఆర్టీసీ క్వార్టర్స్‌లోని కొంత భాగంలో కాచిగూడ ఆర్టీసీ డిపోను 2013లో ఏర్పాటు చేశారు. ఆర్టీసీ క్వార్టర్స్‌కు అనుకుని గతంలో రైల్వే క్వార్టర్స్ ఉండేవి. ఈ రైల్వేక్వార్టర్స్‌ను ప్రస్తుతం పూర్తిగా కూల్చివేశారు. ప్రస్తుతం ఆర్టీసీ క్వార్టర్స్‌లో కొన్ని కుటుంబాలు మాత్రమే నివాసం ఉంటున్నాయి. కర్నాటక, మహారాష్ట్ర, గోవా రాష్ట్రాలకు నుంచి వచ్చిన ఆర్టీసీ బస్సులు నిలుపుకోవడానికి అనువైన స్థలం లేకపోవడంతో గత ప్రభుత్వం ఆర్టీసీ క్వార్టర్స్‌లోని ఖాళీ స్థలంలో బస్సులు నిలుపుకోవడానికి అనుమతి ఇచ్చింది. అదే విధంగా ఇతర రాష్ట్రాల ఆర్టీసీ సిబ్బంది విశ్రాంతి తీసుకోవడానికి క్వార్టర్స్‌ను కూడా కేటాయించారు. ఇతర రాష్ట్రాల బస్సులు ఈ ప్రాంతం గుండా రాకపోకలు సాగిస్తుండడంతో ఆక్వా హోటల్ చౌరస్తా వద్ద రద్దీ ఎక్కువగా ఉంటుంది. కాచిగూడ డిపోకు చెందిన ఆర్టీసీ బస్సులు ఈ స్థలం గుండానే రాకపోకలు సాగిస్తున్నాయి. అదే విధంగా కాచిగూడ రైల్వే స్టేషన్ ముందు వైపు వెళ్లడానికి హిమాయత్‌నగర్, నారాయణగూడ, బర్కత్‌పుర, కోఠికి వెళ్లే వారు ఈ స్థలం గుండా వేసిన రోడ్డు ద్వారానే వెళ్తున్నారు.

4 ఎకరాల 67 గుంటల స్థలం లీజు

ఆదాయాన్ని సమకూర్చుకోవడానికి కాచిగూడ ఆర్టీసీ డిపోకు అనుకుని ఉన్న 4 ఎకరాల 67 గుంట ల స్థలాన్ని లీజుకు ఇస్తున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది. ఈ స్థలం లీజుకు ఇవ్వడం వల్ల కాచిగూడ రైల్వేస్టేషన్ వెనుకభాగం రూపురేఖలు పూర్తిగా మారిపోనున్నాయి. ఖాళీగా ఉన్న ఆర్టీసీ క్వార్టర్స్ మందుబాబులు, ఆకతాయిలకు అడ్డాగా మారింది. ఈ స్థలంలో ఉన్న క్వార్టర్స్ శిథిలావస్థకు చేరడంతో వాటిలో ఉన్న వారిని ఖాళీ చేయిస్తున్నారు. అయితే ఈ స్థలం లీజుకు ఇవ్వడం వల్ల ఇతర రాష్ట్రాల ఆర్టీసీ బస్సులు నిలుపుకోవడం ఇబ్బందికరంగా మారనుంది. ఈ స్థలం ఆర్టీసీ బస్సులు నిలపడానికి ఎంతో అనుకూలంగా ఉండేది. దీనికి లీజుకు ఇవ్వడం వల్ల ఇతర రాష్ట్రాల బస్సు డ్రైవర్లకు ఇబ్బందులు ఏర్పడనున్నాయి. ప్రభుత్వం ఆర్టీసీ స్థలాన్ని లీజుకు ఇవ్వడం వల్ల మెరుగైన ఆదాయం సమకూర్చుకునే అవకాశం ఉంది.



శిథిలావస్థకు చేరిన ఆర్టీసీ క్వార్టర్స్

ఏఐసీసీ తెలంగాణ ఇన్‌చార్జికి సన్మానం



దీపాదాస్‌మున్షీని సన్మానిస్తున్న కెన్నెడీకృపారావు

చిక్కడపల్లి, జనవరి3 (ఆంధ్రజ్యోతి): ఏఐసీసీ తెలంగాణ ఇన్‌చార్జిగా నియమితులైన సీనియర్ కాంగ్రెస్ నాయకురాలు దీపాదాస్‌మున్షీని ఆ పార్టీ సీనియర్ నాయకులు కెన్నెడీ కృపారావు, మాజీ కార్పొరేటర్ వాజీద్‌హుస్సేన్ బుధవారం అభినందించారు. అనంతరం ఆమెకు శుభాకాంక్షలు తెలిపారు.

● ఆటో కార్మికుల బిక్షాటన



ఆటో కార్మికులను ప్రభుత్వం ఆదుకోవాలని తెలంగాణ ఆటో మోటార్ అండ్ డ్రైవర్స్ ట్రేడ్ యూనియన్ (టీఏటీయూ) రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు హైదరాబాద్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఫీవర్ ఆస్పత్రి చౌరస్తాలో బిక్షాటన చేశారు. యూనియన్ నగర అధ్యక్షుడు పోలే నిరంజన్, ప్రధాన కార్యదర్శి ఎస్.రామకృష్ణ, సర్పంచ్ వెంకన్న, గోపాల్ చారి, మురళి, రామస్వామి, రాజేశ్వరరావు, అశోక్, హనుమంతరావు పాల్గొన్నారు. - గోల్నాక, ఆంధ్రజ్యోతి

● గణపతి హోమం



బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యవర్గసభ్యుడు బిజ్జి కనకేష్‌కుమార్ ఆధ్వర్యంలో ముషీరాబాద్‌లో గణపతిహోమం నిర్వహించారు. - ముషీరాబాద్, ఆంధ్రజ్యోతి

సావిత్రిబాయిపూలే సేవలు మరువలేనివి

- కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి
- మహిళా వర్సిటీలకు సావిత్రిబాయిపూలే పేరు పెట్టేందుకు కృషి చేస్తా : వీహెచ్



మాట్లాడుతున్న కిషన్‌రెడ్డి, నిర్వాహకులు మురళీకృష్ణ

రాంనగర్, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): స్త్రీలకు విద్య అందించేందుకు నడుం బిగించి స్త్రీ జనోద్ధరణకు సావిత్రిబాయి పూలే చేసిన సేవలు మరువలేనివని కేంద్రమంత్రి జి.కిషన్‌రెడ్డి తెలిపారు. బుధవారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో తెలంగాణ బీసీ జనజాగృతి సంస్థ అధ్యక్షుడు కె.మురళీ కృష్ణ ఆధ్వర్యంలో సావిత్రిబాయిపూలే జయంతి ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ రంగాలకు చెందిన మహిళలకు విశిష్ట పురస్కారాలు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కేంద్రమంత్రి జి.కిషన్‌రెడ్డి, గౌరవ అతిథులుగా మాజీ ఎంపీ వి.హనుమంతరావు, బీసీ కమిషన్ మాజీ ఛైర్మన్ వకుళాభరణం కృష్ణమోహన్‌రావు, మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి, బీజేపీ సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు ఎన్.గౌతమ్‌రావు, ఖైరతాబాద్ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షురాలు శంభుల ఉషశ్రీ శ్రీకాంత్‌గౌడ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా కిషన్‌రెడ్డి మాట్లాడుతూ.. జనాభాలో సగభాగం ఉన్న మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ పార్లమెంటులో బిల్లు అమలు చేసిన ఘనత బీజేపీదేనన్నారు. మాజీ ఎంపీ వీ హనుమంతరావు మాట్లాడుతూ.. రాష్ట్రంలో నెలకొల్పిన మహిళా విశ్వవిద్యాలయాలకు సావిత్రిబాయిపూలే పేరు పెట్టాలని కోరతానని తెలిపారు. వకుళాభరణం కృష్ణమోహన్‌రావు మాట్లాడుతూ.. సావిత్రిబాయి తొలిమహిళా ఉపాధ్యాయురాలుగానే కాకుండా సంఘసంస్కర్తగా తెచ్చుకున్నారు. తెలంగాణ బీసీ జనజాగృతి అధ్యక్షుడు కేపీ మురళీకృష్ణ మాట్లాడుతూ.. సావిత్రిబాయి చేసిన సేవలను గుర్తించి ఆమెకు భారతరత్న ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో నాగపరిమళ, ఐలయ్య, ఎ.రమేష్, పి.రమేష్, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.



సావిత్రిబాయిపూలే చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఐద్వా ప్రధాన కార్యదర్శి మల్లు లక్ష్మి, అధ్యక్షురాలు అరుణజ్యోతి



నిజాం కళాశాలలో సావిత్రిబాయిపూలేకు నివాళులర్పిస్తున్న ప్రొఫెసర్ కంచ ఐలయ్య, ప్రిన్సిపాల్ ప్రొ. భీమా, వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ ఉపేందర్‌రెడ్డి, వెంకటేశ్వర్లు, ప్రొ.మోహన్‌రెడ్డి ఉన్నారు



మహిళలకు చీరలు పంపిణీ చేస్తున్న గాంధీనగర్ కార్పొరేటర్ పావనివినయ్‌కుమార్, వినయ్‌కుమార్, లక్ష్మణ్‌యాదవ్, రత్నసాయి



గోల్నాక డివిజన్ అన్నపూర్ణనగర్‌లోని సెయింట్ జోసఫ్ స్కూల్‌లో సావిత్రిబాయిపూలే చిత్రపటానికి నివాళులర్పిస్తున్న జోరిగల శ్రీధర్, పిల్లి దుర్గాప్రసాద్ తదితరులు

సావిత్రిబాయిపూలే జయంతి సందర్భంగా తెలంగాణ బీసీ జాగృతి ఆధ్వర్యంలో బాగ్‌లింగంపల్లి సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో సంఘ సేవకురాలు శివకుమారికి అవార్డు అందజేస్తున్న కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి.



వీఆర్ఏల పట్ల ప్రభుత్వం సానుకూలం



మంత్రి శ్రీనివాస్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలుపుతున్న ఆర్.విజయ్, తదితరులు

కవాడిగూడ, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): వీఆర్ఏల సమస్యలు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి వాటి పరిష్కారానికి సహకరించిన డిప్యూటీ కలెక్టర్ల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు లచ్చిరెడ్డికి వీఆర్ఏల హక్కుల సాధన సమితి రాష్ట్ర ఛైర్మన్ ఆర్.విజయ్ కృతజ్ఞతలు తెలిపారు. బుధవారం ఇందిరాపార్కు ధర్నా చౌక్‌లో ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. బీఆర్ఎస్ ప్రభుత్వం వీఆర్ఏలను వివిధ డిపార్ట్‌మెంట్‌లలో న్యూమరీ పోస్టుల పేరుతో సర్దుబాటు చేసిందని ఆయన గుర్తు చేశారు. 20 వేల మంది వీఆర్ఏలకు 8 నెలలుగా వేతనాలు లేక వెట్టి చాకిరి చేస్తున్నామని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. వీఆర్ఏలు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడంలో కీలకపాత్ర పోషించిన లచ్చిరెడ్డికి రుణపడి ఉంటామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో సాధన సమితి కన్వీనర్ సత్యనారాయణ, సెక్రటరీ జనరల్ అంబాల శ్రీధర్‌గౌడ్, నేతలు లక్ష్మీనారాయణ, చిరంజీవి, చిన్నారెడ్డి, శివరాం, సునిత, సంకీర్తన, అర్జున్ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధియే లక్ష్యంగా నిరంతరం పని చేస్తా..

ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్



శాంతినగర్‌లో డ్రైనేజీ పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్, కార్పొరేటర్ లావణ్య

గోల్నాక, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): అంబర్‌పేట నియోజకవర్గం ప్రజలు అభివృద్ధిని ఆదరించి తనను రెండో పర్యాయం భారీ మెజార్టీతో గెలిపించిన ప్రజలకు మనస్ఫూర్తిగా కృతజ్ఞతలు తెలుపుతూ వారి ఆదరణను ఎన్నటికీ మర్చిపోకుండా నిరంతరం అభివృద్ధియే లక్ష్యంగా పని చేస్తానని ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ అన్నారు. బుధవారం డివిజన్ పరిధిలోని గోల్నాక కొత్తబ్రిడ్జి హనుమాన్ టెంపుల్ దగ్గరలోని శాంతినగర్‌లో రూ.12 లక్షల వ్యయంతో నూతనంగా నిర్మించ తలపెట్టిన డ్రైనేజీపైపులైన్ నిర్మాణం పనులకు ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ స్థానిక కార్పొరేటర్ దూసరి లావణ్యశ్రీనివాస్‌గౌడ్‌తో కలిసి శంకుస్థాపన చేశారు. అనంతరం బస్తీలో పర్యటించి ప్రజలను కలుసుకుని తనను ఆదరించి గెలిపించి మరోసారి అవకాశం కల్పించినందుకు కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో ఆర్.కె.బాబు, ఖాదర్‌షరీఫ్, బి.నర్సింగ్‌రావుయాదవ్, ముడిగ నర్సింగ్‌యాదవ్, సురేష్‌గౌడ్, యూసూఫ్‌షరీఫ్, గాజుల గోపాల్, మల్లేష్‌గౌడ్, ఎస్.భిక్షపతి, వినోద్, సంతోష్ పాల్గొన్నారు.

● సైన్స్ వర్క్ షాప్‌లు

నల్లకుంట: డివిజన్‌లోని తిలక్‌నగర్ మోడల్ హై స్కూల్‌లో బుధవారం అటల్ టింకరింగ్ సైన్స్ వర్క్ షాప్ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా అంబర్‌పేట నియోజకవర్గం ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్, కార్పొరేటర్ యాకర.అమృత ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన వైజ్ఞానిక ప్రదర్శనను వారు పరిశీలించారు. కార్యక్రమంలో టీచర్లు శిరీష, ప్రశాంతి, నిర్మల, వెన్నెల, ప్రార్థన, మాన్సీ జైన్ తదితరులు పాల్గొన్నారు.

20 సెంటర్లు.. 9,406 దరఖాస్తులు



అంబర్‌పేటలోని సెంటర్‌ను పరిశీలిస్తున్న కృష్ణాయాదవ్

బర్కత్‌పుర/ నల్లకుంట/ అంబర్‌పేట, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): అంబర్‌పేట నియోజకవర్గంలోని ఐదు మున్సిపల్ డివిజన్లలో గల 20 సెంటర్లలో బుధవారం లబ్ధిదారులు 9,406 దరఖాస్తులు సమర్పించారు. నియోజకవర్గంలోని అన్ని సెంటర్ల వద్ద ఐదో రోజు జనం తరలివచ్చారు. ఐదు రోజుల నుంచి మొత్తం 59,310 దరఖాస్తులు అందాయి. బుధవారం అభయహస్తం కింద 6,787 మంది దరఖాస్తు చేసుకోగా ఇతర దరఖాస్తులు 2,619 వచ్చాయి. అభయహస్తం కింద ఇప్పటి వరకు 47,453 దరఖాస్తులు సమర్పించారు. ఈనెల 6వ తేదీ వరకు దరఖాస్తులను సమర్పించాలని కోరారు. ఈ సందర్భంగా బీజేపీ సీనియర్ నాయకుడు, మాజీమంత్రి సి.కృష్ణాయాదవ్ అంబర్‌పేట, నల్లకుంట డివిజన్లలోని సెంటర్లను సందర్శించి ఐదు గ్యారెంటీ పథకాల దరఖాస్తులను పరిశీలించారు. దరఖాస్తు గడువు మరింత పెంచాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

ఎవరూ ఆందోళన చెందొద్దు : కవిత

కవాడిగూడ: అభయహస్తం పథకంలో భాగంగా అమలుచేసే పథకాల దరఖాస్తులు అందరికీ అందుబాటులో ఉంటాయని, ఎవరూ ఆందోళన చెందవద్దని కవాడిగూడ డివిజన్ మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు గజ్జెల కవిత లబ్ధిదారులకు సూచించారు. బుధవారం డివిజన్‌లోని తాళ్ల బస్తీ కమ్యూనిటీహాలు, ముగ్గుబస్తీ అంగన్‌వాడీ కేంద్రం, బండమైసమ్మనగర్ కమ్యూనిటీహాలు, దోమలగూడ వార్డు కార్యాలయాన్ని ఆమె సందర్శించి దరఖాస్తులు ప్రజలకు అందజేశారు.

అర్హులందరికీ పథకాలు అందజేయాలి

రాంనగర్: ప్రజాపాలన కార్యక్రమంలో దరఖాస్తు చేసుకున్న అర్హులందరికీ ఐదు గ్యారెంటీలు అమలు జరిగేలా ప్రభుత్వం కృషి చేయాలని బాగ్‌అంబర్‌పేట డివిజన్ కార్పొరేటర్ బి.పద్మావెంకటరెడ్డి డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ అధ్యక్ష, కార్యదర్శులు చంద్రమోహన్, మిరియాల శ్రీనివాస్,నాయకులు సురేష్,మహేష్, బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

'అవినీతిలో కూరుకుపోయిన ఈఎస్ఐని ప్రక్షాళన చేయాలి'

రాంనగర్/హైదరాబాద్, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): అవినీతితో కూరుకుపోయిన ఈఎస్ఐ (ఎంప్లాయిస్ స్టేట్ ఇన్సూరెన్స్)ని ప్రక్షాళన చేయాలని, ఈఎస్ఐ డైరెక్టర్, జాయింట్ డైరెక్టర్, కార్మిక శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీలను తొలగించాలని సీపీఎం డిమాండ్ చేసింది. ఈ మేరకు సీపీఎం హైదరాబాద్ నగర కార్యదర్శి ఎం.శ్రీనివాస్ సీఎం రేవంత్‌రెడ్డికి లేఖ రాశారు. ఇందుకు సంబంధించిన వివరాలను గోల్కొండ చౌరస్తాలోని నగర పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన వెల్లడించారు. తెలంగాణ ఈఎస్ఐ డైరెక్టరేట్ పరిధిలో ఆరు ఆస్పత్రులు, 70కి పైగా డిస్పెన్సరీలు 18 లక్షల కార్మిక కుటుంబాలకు వైద్య సేవలు అందిస్తున్నాయని తెలిపారు. ఈఎస్ఐలో జరుగుతున్న అవినీతిపై 2019లో కేసులు నమోదు కాగా, అనేక మంది అధికారులు, ప్రైవేట్ వ్యక్తులు అరెస్టు అయ్యారని పేర్కొన్నారు. అయినప్పటికీ ఈఎస్ఐలో అవినీతి ఆగడంలేదన్నారు. టెలీమెడిసిన్ పేరుతో నానోరే మెడికల్ టెక్నాలజీ అనే బోగస్ సంస్థకు రూ.10 కోట్లు చెల్లించారని, ఇది అధికారుల బినామీ కంపెనీ అని ఆరోపించారు.

కనులపండువగా శారదామాత జయంతి



ప్రసంగిస్తున్న స్వామి బోధమయానంద

కవాడిగూడ, జనవరి 3 (ఆంధ్ర జ్యోతి): దివ్యజననీ శారదాదేవీ జయంతి వేడుకలు లోయర్ ట్యాంక్‌బండ్‌లోని దోమలగూడ శ్రీరామకృష్ణమఠంలో కనులపండువగా జరిగాయి. బుధవారం 5.30 గంటలకు సుప్రభాతం, మంగళహారతి, భజనలతో జయంతి వేడుకలు ప్రారంభమయ్యాయి. అనంతరం హైదరాబాద్ రామకృష్ణ మఠం అధ్యక్షుడు స్వామి బోధమయానంద శారదాదేవీ జీవితంపై ప్రసంగించారు. మధ్యాహ్నం 2 గంటలకు దివ్యజననీ శ్రీశారదాదేవీ చలనచిత్రాన్ని ప్రదర్శించారు. సాయంత్రం 4 గంటలకు ప్రత్యేకంగా రూపొందించిన శారదామాత బెంగుళూరు రాక్ నమూనా దగ్గర ప్రత్యేక పూజలు నిర్వహించారు. రామకృష్ణమఠం స్వాములు, భిక్షులు, వలంటీర్లు పాల్గొన్నారు.

జవహర్‌నగర్ కమ్యూనిటీహాల్‌ను ఉపయోగంలోకి తేవాలి



స్థానికుల వినతిపత్రం పరిశీలిస్తున్న డీఎంసీ

చిక్కడపల్లి, జనవరి 3(ఆంధ్రజ్యోతి): గాంధీనగర్ డివిజన్‌లోని జవహర్‌నగర్ కమ్యూనిటీహాల్ పేద, మధ్య తరగతి కుటుంబాలు శుభకార్యాలు చేసుకునేందుకు కమ్యూనిటీ హాల్‌ను ప్రజలకు అందుబాటులో ఉంచాలని కోరుతూ జవహర్‌నగర్ ఎస్ఆర్‌టీ, టీఆర్‌టీకాలనీ సొసైటీ సభ్యులు జీహెచ్ఎంసీ సర్కిల్-15 డీఎంసీ డా.తిప్పర్తి యాదయ్యకు విజ్ఞప్తి చేశారు. బుధవారం కమ్యూనిటీహాల్‌కు చేరుకున్న యాదయ్యకు ఈ సందర్భంగా వారు ఓ వినతిపత్రం సమర్పించి సమస్యలు వివరించారు. ఈ సందర్భంగా సొసైటీ సభ్యులు నర్మెట్ల మల్లేష్, గుండు జగదీశ్‌బాబు, రత్నసాయిచంద్ ఆయనతో మాట్లాడుతూ.. కమ్యూనిటీహాల్‌లో బతుకమ్మ చీరలు ఉంచారని, ఇతరత్రా వస్తువులతో నింపివేశారని తెలిపారు. కమ్యూనిటీహాల్ ఆవరణలో చెత్తాచెదారాలు పేరుకుపోయాయని శుభకార్యాలు నిర్వహించుకునేందుకు వీలులేకుండా చేశారని వాపోయారు. ముషీరాబాద్ నియోజకవర్గానికి సంబంధించిన బతుకమ్మ చీరలతో కమ్యూనిటీహాల్ పేరుకుపోయిందన్నారు. దీంతో శుభకార్యాలు నిర్వహించుకోవడానికి స్థానికులకు మున్సిపల్ సిబ్బంది ఎలాంటి అవకాశంకల్పించడం లేదన్నారు. కమ్యూనిటీహాల్ స్థానికులకు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని డీఎంసీ కోరారు. కార్యక్రమంలో సాయిలు, నర్సింగ్‌రావు, సురేందర్, మల్లేష్, కృష్ణ, కమర్‌బాయ్, బాబురావు, సాయికీర్త్ (బాబీ) పాల్గొన్నారు.